14-03-2025
శుక్రవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 174 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి

JB జయభేరి



# డీలిమిటేషన్ పై పోరాటం

దక్షిణాదిలో బీజేపీకి ప్రాధాన్యత ఉండటం లేదని అన్నారు. అందుకే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇది డీలిమిటేషన్ కాదని... దక్షిణాది పరిధి తగ్గించే ప్రయత్నమని ఆరోపించారు. బీజేపీ చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పికొట్టేందుకు చెన్నైలో స్టాలిన్ ఏర్పాటు చేస్తున్న సమావేశానికి వెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు.

**జయభేరి, న్యూఢిల్లీ, మార్చి 13:**

భారత దేశంలో జరిగే నియోజకవర్గాల పునర్విభజన ఉద్యానికి మద్దతు ప్రకటించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కుట్ర పూరితంగానే దక్షిణాది రాష్ట్రాలను అణగదొక్కే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. దీనికి వ్యతిరేకంగా అన్ని రాష్ట్రాలు కదలాలని పిలుపునిచ్చారు. మార్చి 22న జరిగే దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశానికి రావాలని రేవంత్ రెడ్డిని తమిళనాడు సీఎం స్టాలిన్ ఆహ్వానించారు. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల సీఎంలకు వ్యక్తిగతంగా లేఖలు రాశారు. ఇప్పుడు ఆ పార్టీకి చెందిన ప్రతినిధుల బృందం ఆయా సీఎంలతో సమావేశమై ప్రత్యేకంగా ఆహ్వానించనుంది. అందులో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అహ్వానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తమిళనాడు మంత్రి టి.కె.నెహ్రూ ఆధ్వర్యంలోని డీఎంకే ప్రతినిధి బృందం ఢిల్లీలో కలిశారు. తమిళనాడు సీఎం తరపున సభకు ఆహ్వానించారు. నియోజకవర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు జరిగే నష్టంపై చర్చించారు. దీనిపైనే చర్చించేందుకు 22న జరిగే దక్షిణాదిలోని కీలక నేతలను ఆహ్వానిస్తున్నట్టు డీఎంకే బృందం తెలిపింది.డీఎంకే ప్రతినిధులతో భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. దక్షిణాదిలో బీజేపీకి ప్రాధాన్యత ఉండటం లేదని అన్నారు. అందుకే కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇది డీలిమిటేషన్ కాదని... దక్షిణాది పరిధి తగ్గించే ప్రయత్నమని ఆరోపించారు. బీజేపీ చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పికొట్టేందుకు చెన్నైలో స్టాలిన్ ఏర్పాటు చేస్తున్న సమావేశానికి వెళ్లే ప్రయత్నం చేస్తామన్నారు. పార్టీ కేంద్ర నాయకత్వం అనుమతి తీసుకొని వెళ్లే అంశంపై ఓ నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రేవంత్ రెడ్డి ఏమన్నారంటే" బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం చేపట్టేది డీలిమిటేషన్ కాదు. దక్షిణాది పరిధిని కుదించడమే. దీన్ని మేం అంగీకరించబోం. నార్త్‌తో పోలిస్తే మేం చాలా పన్నులు కడుతున్నాం. చాలా కంపెనీలు ఉన్నాయి. ఆంత్రపెన్యూర్లు కూడా అక్కడే ఎక్కువ

...మిగతాది 2 లో

# స్పీకర్ పై అవిశ్వాసం
## బీఆర్ఎస్ నిర్ణయం






**జయభేరి, హైదరాబాద్, మార్చి 13:**

తెలంగాణలో స్పీకర్‌పై బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ప్రజాస్వామ్యబద్ధంగా పని చేయాలని సూచిస్తోంది. లేకుంటే అవిశ్వాసం పెట్టేందుకు వెనుకాడబోమని ఆ పార్టీ ఎమ్మెల్యే హరీష్‌రావు ప్రకటించారు. సభలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉదయం నుంచి తెలంగాణ అసెంబ్లీలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఉదయం సభ ప్రారంభమైన తర్వాత గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడారు. మొదట కాంగ్రెస్ నేతలు మాట్లాడిన తర్వాత బీఆర్ఎస్‌కు స్పీకర్ అవకాశం ఇచ్చారు. ఈ చర్చలో మాట్లాడిన జగదీష్ రెడ్డి కాంగ్రెస్ పాలనపై విమర్శలు చేశారు. జగదీష్ రెడ్డి విమర్శలను తిప్పి కొట్టిన అధికార పక్షం అసలు విషయలపై మాట్లాడాలని సూచించారు. ఇలా ఇరు వర్గాల మధ్య వాగ్వాదం నడిచింది. ఇంతలో స్పీకర్ మరోసారి జగదీష్ రెడ్డికి మాట్లాడే ఛాన్స్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ సభ మీది కాదని అందరిదీ అని అన్నారు. ''ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉన్నాయి. మా అందరి తరఫున పెద్ద మనిషిగా, స్పీకర్‌గా మీరు కూర్చున్నారు. ఈ సభ మీ సొంతం కాదు'' అని అనడంతో దుమారం రేగింది. జగదీష్ రెడ్డి కామెంట్స్‌పై కాంగ్రెస్ మరోసారి మండిపడింది. స్పీకర్‌ను ఉద్దేశించి అలా ఎలా మాట్లాడతారని ప్రశ్నించింది. దళితులంటే గౌరవం లేదని అందుకే బీఆర్ఎస్ ప్రతిపక్షంలో కూర్చొందని ఎద్దేవా చేశారు. జగదీష్ రెడ్డి క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు సహా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. స్పీకర్ను దూషించేలా జగదీష్ రెడ్డి సహా బీఆర్ఎస్ నేతల తీరు ఉందని మండిపడ్డారు. ఇంతలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ నేతల తీరును తప్పు పట్టారు. జగనదీష్ రెడ్డి ఏం తప్పుగా మాట్లాడారని నిలదీశారు. సభలో అందరికీ సమానం హక్కులు

...మిగతాది 2 లో

# ఇంటర్మీడియట్ విద్యలో కీలక సంస్కరణలకు శ్రీకారం



- ఇంటర్మీయట్ మ్యాథ్స్ ఎ-బి ఒకే సబ్జెక్ట్, బాటనీ-జువాలజీ ఒకే సబ్జెక్టు!
- ఫిబ్రవరి చివరి వారం నుంచే ఇంటర్మీడియట్ పరీక్షలు
- జూనియర్ కాలేజిల్లో ఎం.బైపిసి కోర్సుకు అనుమతి
- మంత్రి లోకేష్ అధ్యక్షతన ఇంటర్మీడియట్ బోర్డు సమావేశం

**జయభేరి, అమరావతి:**

విస్తృత ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం ఇంటర్మీడియట్ బోర్డులో సంస్కరణలకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పచ్చజెండా ఊపారు. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ 77వ సమావేశం అమరావతి అసెంబ్లీలోని పేషిలో మంత్రి లోకేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఇంటర్మీడియట్ లో విద్యలో నాణ్యత ప్రమాణాలను పెంపొందించి విద్యార్థులను ప్రభుత్వ జూనియర్ కాలేజిలవైపు ఆకర్షించేలా పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కాలేజిల విద్యార్థులను తయారుచేసేందుకు 202526 విద్యాసంవత్సరం నుంచి క్యాలెండర్ లో మార్పులు చేపట్టారు. ఈ విద్యా సంవత్సరం నుంచి జూన్ 1వతేదీకి బదులుగా ఏప్రిల్ 1 నుంచే ప్రభుత్వ

...మిగతాది 2 లో



# పంటలు ఎండినా పట్టింపు లేదా..?

- అన్నదాతల ఆక్రందనలు విన్పించడం లేదా
- కాల్వల్లో నీళ్లున్నా ఎందుకు వదలడం లేదు
- రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యానికి రైతులు ఎందుకు మూల్యం చెల్లించాలి,
- దీనిని కూడా కేంద్రంపై నెట్టేసి తప్పించుకోవాలనుకుంటున్నారా?
- రైతు భరోసా ఇవ్వరు, రుణమాఫీ పూర్తి చేయరు
- పంట నష్టపరిహారం ఇవ్వరు
- ఇదేనా కాంగ్రెస్ మార్క్ రైతు సంక్షేమ రాజ్యమంటే?
- రాజకీయ నాయకుల స్టేచర్ గురించి కాదు రైతుల ఫ్యూచర్ ఆలోచించండి.
- అసెంబ్లీలో తక్షణమే రైతు సమస్యలపై చర్చించండి
- కష్టాల్లో ఉన్న రైతాంగానికి ఆదుకునే చర్యలు చేపట్టండి.
- యాసంగి పూర్తయ్యేవరకు నీళ్లొదలండి
- కేంద్రమంత్రి, బండి సంజయ్ కుమార్

...మిగతాది 2 లో

# స్మార్ట్ రేషన్‌కార్డులు జారీ టెండర్లకు పిలుపు




**జయభేరి, హైదరాబాద్:**

కొత్త రేషన్‌కార్డులను స్మార్ట్ కార్డుల రూపంలో ఇచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధం అవుతోంది. రాష్ట్రంలో దాదాపు 90 లక్షల కుటుంబాలకు రేషన్‌కార్డులు ఉన్నాయి. కొత్తగా దరఖాస్తు చేసుకున్నవారు లక్షల సంఖ్యలో ఉన్నారు. అందరికీ స్మార్ట్ రేషన్‌కార్డులు జారీ చేయనుంది. ఈ మేరకు సర్కారు టెండర్లు పిలిచింది. బిడ్ల దాఖలుకు మార్చి 25వ వరకు గడువు ఇచ్చింది ప్రీబిడ్ సమావేశాన్ని మార్చి 17న నిర్వహిస్తామని పేర్కొంది.

# ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెండ్

**జయభేరి, హైదరాబాద్, మార్చి 13:**

అసెంబ్లీలో స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఈ క్రమంలోనే సభ నుంచి ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఆయన సస్పెండ్ కు గురయ్యారు. సస్పెండ్ అయిన అభ్యర్థిని బయటకు పంపాలని స్పీకర్ ఆదేశించారు.జగదీష్ రెడ్డి మాట్లాడిన వీడియోను మంత్రులు పరిశీలించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర మంత్రులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయాలని స్పీకర్ కు మంత్రులు ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారుముందుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉంటాయని అన్నారు. సభ్యుల అందరి తరపున పెద్ద మనిషిగా స్పీకర్ వ్యవహరించాలని చెప్పారు. ఈ సభ మీ సొంతం కాదని ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ ఆక్షేపించారు.ఈ క్రమంలోనే.. దళిత స్పీకర్ ను ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అవమానించారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు.



స్పీకర్ కు కనీసం గౌరవం కూడా ఇవ్వడం లేదని వారు ఫైరయ్యారు. జగదీష్ రెడ్డిపై స్పీకర్ వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అసెంబ్లీలో అధికారులు, మార్షల్స్ ను అలెర్ట్ చేశారు. అసెంబ్లీలో లాబీలో భారీగా మార్షల్స్ చేరుకున్నారు.అయితే ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని స్పీకర్ సస్పెండ్ చేయడంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి బయటకు వెళ్లారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే నిరసన వ్యక్తం చేస్తున్నారు.

# చట్టసభల్లో సంస్కారం లేని వాళ్ళు..!?

2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## స్పీకర్ పై అవిశ్వాసం

ఉన్నాయని చెప్పడం తప్పా అని ప్రశ్నించారు. దీంతో కాంగ్రెస్ సభ్యులు మరింతగా ఫైర్ అయ్యారు. మొదటి నుంచి దళితులంటే బీఆర్ఎస్‌కు చిన్నచూపే అన్నారు. ఉద్యమం సమయంలో దళితుడే తెలంగాణ మొదటి ముఖ్యమంత్రి అని చెప్పిన కేసీఆర్ మోసం చేశారని అన్నారు. అప్పటి నుంచి అడుగడుగునా దళితులను తొక్కే ప్రయత్నం చేశరాని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సభ్యుల కామెంట్స్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ నేతలు, వాళ్లకు వ్యతిరేకంగా అధికార పార్టీ లీడర్లు నినాదాలు చేసుకున్నారు. ఇలాంటి గందరగోళ పరిస్థితుల్లో సభను స్పీకర్ వాయిదా వేశారు. వాయిదా తర్వాత మీడియా పాయింట్ వద్ద కూడా ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకున్నారు. ఈ క్రమంలోనే హరీశ్‌రావు అవిశ్వాస తీర్మానం విషయం తెరపైకి తీసుకొచ్చారు. స్పీకర్ ప్రజాస్వామ్యబద్ధంగా సభను నడిపించకపోతే కచ్చితంగా అవిశ్వాస తీర్మానం పెడతామన్నారు. సభ వాయిదా పడిన తర్వాత మీడియాతో చిట్ చాట్ చేసిన మాజీ మంత్రి హరీశ్ రావు...స్పీకర్‌ను జగదీష్ రెడ్డి అవమానించలేదని మరోసారి స్పష్టం చేశారు. సభ మీ ఒక్కరిది కాదు అందరిదీ అన్నారని గుర్తు చేశారు. మీ అనే పదం సభ నిబంధనలకు విరుద్ధం కాదని తెలిపారు. మీ ఒక్కరిదీ అనే పదం అన్ పార్లమెంట్ పదం కానేకాదన్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఎందుకు నిరసన చేశారో తెలీదని ఎద్దేవా చేశారు. సభను ఎందుకు వాయిదా వేశారో కూడా అర్థం కాలేదన్నారు. కాంగ్రెస్ డిఫెన్స్‌లో పడిందని అభిప్రాయపడ్డారు. ఇదే అంశంపై స్పీకర్‌ను కలిసి సభా రికార్డులు తీయాలని కోరామన్నారు. జగదీష్ రెడ్డి మాట్లాడిన సభ వీడియో రికార్డు అడిగామని తెలిపారు. ఆ వీడియోలు కూడా ఇవ్వలేదని అసహనం వ్యక్తం చేశారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద BRS ఎమ్మెల్యేలను మాట్లాడకుండా బ్లాక్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## డీలిమిటేషన్ పై పోరాటం

ఉన్నారు. అందుకే దక్షిణాదికి వ్యతిరేకంగా కేంద్రం కుట్రలు చేస్తోంది. అక్కడ బీజేపీ విస్తరణకు అవకాశం ఇవ్వడం లేదు. కేరళ, తమిళనాడు, కర్ణాటక తెలంగాణలో వాళ్లు అధికారంలో లేరు. రాలేరు. అందుకే దీన్ని సెటిల్ చేయడానికి ఇప్పుడు డీలిమిటేషన్ అంటూ కుట్ర చేస్తున్నారు. " అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి కుట్రలను తిప్పికొట్టేందుకు అందర్నీ ఏకం చేయడం అవసరం. అందులో భాగంగా స్టాలిన్ ఏర్పాటు చేసిన మీటింగ్‌ను స్వాగతిస్తున్నట్టు తెలిపారు. ఇలాంటి కీలకమైన మీటింగ్‌కు హాజరవ్వాలని కాంగ్రెస్ ప్రాథమికంగా అంగీకరించింది అన్నారు. కేంద్ర నాయకత్వం నుంచి అనుమతి తీసుకొని అధికారికంగా ప్రకటన చేస్తామని తెలిపారు. తెలంగాణలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలతో దీనిపై చర్చించాలని నిర్ణయించామన్నారు రేవంత్ రెడ్డి. అందుకే అన్ని పార్టీలను ఆహ్వానించి అఖిలపక్షం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్టు వెల్లడించారు. స్టాలిన్ ఏర్పాటు చేసే మీటింగ్‌కు వెళ్లే లోపు తెలంగాణలో అన్ని పార్టీల అభిప్రాయాలు తెలుసుకుంటామని చెప్పారు. ఈ సమస్య ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదన్నారు. దక్షిణాదిలో ఉండే ప్రజలందరికీ నష్టం కలిగించే ప్రక్రియని ఆందోళన వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ ఇష్యూ పార్టీలకు అతీతంగా స్పందించాల్సిన సమస్యగా అభివర్ణించారు. అందుకే పార్టీలకు అతీతంగా అందర్నీ ఆహ్వానిస్తామన్నారు రేవంత్. దక్షిణాదిలో ఉన్న బీజేపీ నేతలను కూడా పిలుస్తామన్నారు. తెలంగాణ బీజేపీ ప్రెసిడెంట్ కిషన్ రెడ్డిని కూడా ఆహ్వానించాలని డిప్యూటీ సీఎం భట్టి, మాజీ మంత్రి జానారెడ్డికి చెప్పినట్టు సీఎం తెలిపారు. ఆయన కూడా దీనిపై స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హక్కుల కోసం గళమెత్తాలని సూచించారు. మార్చి 22న జరిగే మీటింగ్ తర్వాత పోరాటం మరింత ఉద్ధృతం చేస్తామని రేవంత్ తెలిపారు. దీనికి నాయకత్వం వహిస్తున్న స్టాలిన్‌ను ప్రోత్సహిద్దామని రేవంత్ పిలుపునిచ్చారు.

**నిర్మలమ్మను చూసి నేర్చుకోండి**

బీఆర్ఎస్ నేతలు పైశాచిక ఆనందం పొందుతున్నారన్నారు సీఎం రేవంత్ రెడ్డి. పంటలు ఎండిపోయినా, ప్రజల ప్రాణాలు పోతున్నా బీఆర్ఎస్ నేతలు డ్యాన్సులు వేస్తున్నారని మండిపడ్డారు. గురువారం ఢిల్లీలో మీడియాతో ఆయన చిట్ చాట్ చేశారు. పలు అంశాలపై మాట్లాడారు. తొలుత ఎమ్మెల్సీ టికెట్ల వ్యవహారంపై మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు రానివారికి అధికారంలోకి వచ్చిన తర్వాత న్యాయం చేస్తానని హామీ ఇచ్చామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు అమలు చేసి చూపిస్తున్నామని గుర్తు చేశారు. పార్టీ అనుబంధ విభాగాల్లో పని చేసిన వారికి ఒకేసారి 37 కార్పొరేషన్ చైర్మన్ పదవులు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. అందులో భాగంగానే అద్దంకి దయాకర్, విజయశాంతి, శంకర్ నాయక్‌లకు ఎమ్మెల్సీ సీట్లు ఇచ్చామన్నారు. చాలామందికి డీసీసీ అధ్యక్షులందరికీ పదవులు ఇచ్చిన విషయాన్ని వివరించారు. గాంధీ కుటుంబంతో తనకు మంచి అనుబంధం ఉందన్న ఆయన, తాను ఫోటోలు దిగి చూపించాల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర కేబినెట్ లో ఉన్న ఆర్థికమంత్రి నిర్మల సీతారామన్ గతంలో తమిళనాడుకు మెట్రో ప్రకటనలో కీలక పాత్ర పోషించారని మనసులోని మాట బయపెట్టారు సీఎం. కానీ, తెలంగాణ రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాత్రం రాష్ట్ర సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు 253 ఎకరాల భూసేకరణ పూర్తి చేస్తామన్నారు సీఎం. మెట్రో, మూసీ ప్రాజెక్టులకు కేంద్రం అనుమతిస్తే సరిపోతుందన్నారు. రుణాలు ఇచ్చేందుకు బ్యాంకులు సిద్ధంగా ఉన్నాయని వెల్లడించారు. తెలంగాణలో ఏప్రిల్లో మూడు రోజుల పాటు భారత్ సమ్మిట్ నిర్వహించాలని అనుకుంటున్నాము. ఏప్రిల్‌లో మూడు రోజుల పాటు తెలంగాణలో భారత్ సమ్మిట్ నిర్వహించాలని అనుకుంటున్నామని తెలిపారు సీఎం. దీనికి 60 దేశాల నుంచి అతిథులను ఆహ్వానించామని, అందుకు విదేశాంగ శాఖ మంత్రి అనుమతి కావాలన్నారు. అందుకోసమే విదేశాంగ శాఖ మంత్రిని కలిసినట్టు తెలిపారు. ఈనెల 22న చెన్నైలో ఏర్పాటు చేసిన సమావేశానికి తమను ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించిందన్నారు సీఎం. డీలిమిటేషన్ కారణంగా జరిగే నష్టం, భవిష్యత్తు కార్యాచరణ నిర్ణయించడానికి రమ్మని అడిగారని గుర్తు చేశారు. పార్టీ అనుమతి తీసుకున్న తర్వాత ఆ సమావేశానికి హాజరవుతామన్నారు. దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర పన్నుతున్న కుట్రను తిప్పికొట్టడానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. తమిళనాడుకు వెళ్లేలోపు తెలంగాణలో అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఇది పార్టీలకు అతీతంగా స్పందించాల్సిన విషయమన్నారు. త్రీ భాషా విధానంపై డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, జానారెడ్డి నేతృత్వంలో కమిటీ వేశానన్నారు సీఎం రేవంత్. దీనికి బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డిని ఆహ్వానిస్తున్నామన్నారు. తెలంగాణలో అందరి అభిప్రాయాన్ని సేకరించి ఆ తర్వాత డీఎంకే మీటింగ్ మా వైఖరి చెబుతామన్నారు.

## సంస్కరణలకు శ్రీకారం

కళాశాలలు ప్రారంభమవుతాయి. జూన్ 1 వ తేదీకి బదులుగా ఏప్రిల్ 7 నుండి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అడ్మిషన్లు ప్రారంభిస్తారు. 202526 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదివే విద్యార్థులకు వార్షిక పరీక్షలను మార్చి 2026కి బదులుగా ఫిబ్రవరి చివరి వారం నుంచే నిర్వహిస్తారు. ట్యాబులేషన్ రిజిస్టర్లను పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయాలని నిర్ణయించారు. డిజిలాకర్, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సజావుగా ఆన్‌లైన్ యాక్సెస్ ఉండేలా 1973 నుండి 2003 వరకు ఇంటర్మీడియట్ బోర్డు ఫలితాల డేటాను డిజిటలైజ్ చేస్తారు. విద్యార్థులకు సబ్జెక్టుల ఎంపికలో సౌలభ్యాన్ని పెంచి, బహుళవిభాగ అభ్యాసాలను ప్రోత్సహించడానికి ఈ విద్యాసంవత్సరం నుంచే మొదటి సంవత్సరం విద్యార్థులకు ఎలక్టివ్ సబ్జెక్టులను 2వ సబ్జెక్టుగా ప్రవేశపెట్టనున్నారు. లాంగ్వేజెస్, సైన్స్, హ్యూమానిటీస్ విభాగాల్లోని 24 ఆప్షన్స్ లో ఒక సబ్జెక్టును 2వ సబ్జెక్టుగా ఎంపిక చేసుకోవచ్చు. జూనియర్ కళాశాలల్లో ఎంబైపిసి ప్రవేశపెట్టాలనే ప్రజల డిమాండ్ కు అనుగుణంగా ఈ విద్యాసంవత్సరం నుంచి మ్యాథ్స్, బయాలజీ సబ్జెక్టులు అంతర్భాగాలుగా 6 సబ్జెక్టులతో ఎం.బైపిసి కోర్సును ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు 14 సబ్జెక్టులకు (సైన్స్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్ సహా) సవరించిన సిలబస్తో కొత్త పాఠ్యపుస్తకాలు ఈ విద్యాసంవత్సరం నుంచే అమలులోకి వస్తాయి. ఇంటర్మీడియట్ లో ఇప్పటివరకు రెండు సబ్జెక్టులుగా పరిగణిస్తున్న మ్యాథ్స్ ఎ, బిలను ఇకపై ఒకే సబ్జెక్టుగా విలీనం చేశారు. అలాగే బైపిసి విద్యార్థులకు బాటనీ, జువాలజీలు కలిపి ఒకే సబ్జెక్టు ఉండేలా విలీనం చేశారు. ఈ విలీనం వల్ల ఆయా సబ్జెక్టులకు సమాన వెయిటేజీ లభిస్తుంది. ఈఏపిసెట్, జెఇఇ, నీట్ వంటి పరీక్షలకు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులను సన్నద్ధం చేయడానికి సమగ్ర పోటీ పరీక్షల కోచింగ్ మెటీరియల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు తయారు చేస్తుంది. ఈ మెటీరియల్ బోర్డు పోర్టల్‌లో అందుబాటులో ఉంచుతారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు మెటీరియల్ ను ఉచితంగా అందజేస్తారు.

కాంపిటీటివ్ బేస్డ్ ఎసెస్ మెంట్ కోసం ఇంటర్మీడిటయట్, సైన్స్, హ్యూమనిటీస్ విభాగాలప్రశ్నల్లో 10% తప్పనిసరిగా బహుళఎంపిక ప్రశ్నలు (MCQలు), ఖాళీలను పూరించే రూపంలో ఒక మార్కు ప్రశ్నలు ఉండేలా కొశ్చన్ పేపర్ రూపొందించాలని నిర్ణయించారు. NSQF స్థాయి ప్రకారం సిలబస్ సవరణ, వృత్తి విద్యార్థుల కోసం డ్యుయల్ సర్టిఫికేషన్ ను ప్రవేశపెట్టనున్నారు. నైపుణ్య పర్యావరణ వ్యవస్థను మెరుగుపరచడానికి వీలుగా ప్రమాణాలను నిర్ణయించారు. సమగ్ర నిబంధనలను అభివృద్ధి చేయడం, NSQF స్థాయి ప్రకారం వృత్తిపరమైన సిలబస్‌ను మెరుగుపరచడం కోసం భారత ప్రభుత్వ జాతీయ మండలితో సహకరించేలా ప్రణాళిక రూపొందించారు.

# చట్టసభల్లో సంస్కారం లేని వాళ్ళు..!?

అహంకారపూరితమైన మాటలు.. రెచ్చగొట్టే చేతలు.. మాజీ సీఎం కేసీఆర్ వచ్చి పోయాక చట్టసభల్లో జరుగుతున్నది ఏంటి!? ఇదే విషయంపై జయభేరి సీనియర్ జర్నలిస్ట్ కడారి శ్రీనివాస్ కౌంటర్ రాజకీయ సమగ్ర వివరణ...



**✍ జయభేరి, హైదరాబాద్ :**

మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి నిండు సభలో మాట్లాడుతూ ఈ సభ మన అందరిదీ, అందరికీ సమానమైన హక్కు ఉంటుంది, మీది మీ సొంతం కాదు.. ఇలా మాట్లాడుతూ అధికార పక్షాన్ని ఇరకాటంలో పెట్టాలని చూసిన మాజీమంత్రి జగదీశ్ రెడ్డి మాటలు పెద్ద దుమారాన్ని రేపాయి. నిజానికి పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో వీళ్ళు నేర్చుకున్న సాంస్కృతి సాంప్రదాయం ఇదే అని తేటతెల్లమైంది.. స్పీకర్ గారిని ఏకవచనంతో సంబోధించే అహంకారపూరితో కేవలం ప్రతిపక్ష పార్టీలో కూర్చున్న అభ్యర్థులందరికీ అంటే జగదీశ్ రెడ్డి గొప్పవాడు ఏం కాదు... కానీ మాజీ సీఎం కేసీఆర్ వచ్చి పోయిన తరువాత జగదీశ్ రెడ్డి మాటల్లోకు స్వభావం దళితులంటే చిన్నచూపు స్పీకర్ చేరుకు విలువ ఇవ్వకపోవడం ఇవన్నీ చక చక జరిగిపోతున్నాయి.. ఈ సభ మన అందరిదీ అని చెప్పడానికి జగదీశ్ రెడ్డి అర్హుడా!? ఈ సభ నీది కాదు అని చెప్పడానికి జగదీశ్ రెడ్డి ఎవరు? ఒక సాధారణ ఎమ్మెల్యే! గతంలో మంత్రిగా పనిచేసే ఉండొచ్చు కానీ ఆ సంస్కారం ఎక్కడ పోయింది? చట్టసభల్లో కనీసం అవగాహన లేకుండా గుండాల రౌడీల్ల వార్నింగులు దూషణలు అవహేళన అయిన మాటలు ఇలాంటివి చేయొచ్చా? గత పది సంవత్సరాల కేసీఆర్ పాలనలో ప్రతిపక్షంలో అప్పుడు కూర్చున్న కాంగ్రెస్ పార్టీని ఖాళీ పేపర్లు పైకెత్తి నిరసన చేసినందుకే సంపత్ కుమార్ ను ఎమ్మెల్యే అని చూడకుండా సస్పెండ్ చేసిన దాఖలు లేవా? అహంకారపూరితమైన మాటలతో కేసీఆర్ బ్యాచ్ మొత్తం పూర్తిగా ఇంకా తామేదో అధికారంలో ఉన్నట్టుగా దుందుడుకు స్వభావంతో కూడిన మాటలను అహంకారపూరితమైన దూషణలను చేస్తూ సభకు భంగం కలిగిస్తూ తమ నైజాన్ని ప్రదర్శించుకున్నారు.. స్పీకర్ జగదీశ్ రెడ్డి గారు మీరు సహనం కోల్పోవద్దు అని ఇచ్చిన ఆదేశానికి వెంటనే జగదీశ్ రెడ్డి తనదైన నిజస్వరూపాన్ని బయటకి తీశాడు.. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు చేసినదా అంటూ మొదలుపెట్టిన ఆయన వ్యంగ్య మాటలు స్పీకర్ పై కామెంట్ చేయడం రాజ్యాంగం అంటే గౌరవం లేకపోవడమే అన్నట్టుగా! ఒకవైపు మాజీ సీఎం సభకు రాకుండా ఆరు నెలలకు చుట్టం చూపుగా వచ్చినట్టు వచ్చి ఇవ్వాలా వారి అనుచరగానం అధికార పార్టీపై ఏకంగా చట్టసభకు భంగం కలిగించే విధంగా స్పీకర్ గారిని ఏకవచనంతో పిలుస్తూ ఈ సమాజానికి ఏం సందేశాన్ని అందించారు.

**అభివృద్ధి అసలే జరగలేదు అన్న జగదీశ్ రెడ్డి మాటలకు సాక్షాత్తు నిండు సభలు గవర్నర్ ప్రసంగాన్ని వినలేదా? అందించిన ఆ పత్రాలను చదవలేద!? అనే అనుమానాలు కూడా నివృత్తమవుతాయి. కనీసం చట్టసభలు అంటే గౌరవం లేని ఇలాంటి వాళ్ళ ప్రజలు ఎన్నుకునేది! నిండు సభలు స్పీకర్ను అవమానపరిస్తే రాజ్యాంగాన్ని కూడా అవమానపరిచినట్టే! ఒక దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తా అని చెప్పిన నాటి మాజీ సీఎం కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడి దళితులు అంటే అసహ్యించుకున్న అలాంటి నాయకుని అడుగులు అడువేసిన వీళ్లకు ఈ మాటలు రాక నీతి వాక్యాలు ఏమన్నా వస్తాయా అని కాంగ్రెస్ పార్టీ గట్టిగానే సంకేతాలను ఇచ్చింది..**

గత పది సంవత్సరాలు కేసీఆర్ ప్రభుత్వం ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వకుండా కనీసం పేదవారికి అర్హులందరికీ డబల్ బెడ్ రూమ్ అందిస్తామని చెప్పడం దళితులకు మూడెకరాలు ఇస్తానని చెప్పడం ఇలాంటి ఎన్నో పథకాలు బుట్ట దాఖలు చేయలేదా... సంవత్సరం దాటిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఇరగటంలో పెట్టాలని నిండు సభలో జగదీశ్ రెడ్డి మాట్లాడిన మాటల్లో అర్థం ఏంటి!? తెలంగాణ దళిత సమాజం ఒక్కసారి ఆలోచించాలి! ఇలాంటి నిరంకుశ అహంకార దుందుడుకు స్వభావం ఉన్న నేతలు చట్టసభలకు గౌరవం అందిస్తారా? ఇలాంటి వాళ్లు సమాజంలో ఉంటే ఈ సమాజంలో లీడర్లు ఎలా తయారవుతారు! ఇలాంటి అనుచత వ్యాఖ్యలు చేసిన జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయాలని కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్షం ఏక నిర్ణయం తీసుకున్న! సస్పెండ్ చేశారే అనుకో ఆ మాటలు ఇప్పటికే తెలంగాణ సమాజంలోకి వెళ్లాయి కదా!



✍ కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

**శాసనసభలో స్పీకర్కు అత్యంత గౌరవ మర్యాదలు ఇవ్వాల్సిన అవసరం అధికార పార్టీ కి గాని ప్రతిపక్ష పార్టీకి గానీ ఉండవా!? 10 సంవత్సరాల్లో కెసిఆర్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కనీసం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు మాట్లాడితే వారిని చీల్చి చెండాడిన వీళ్లే ఇవ్వాలా ఈ సభ అందరిదీ అని చెప్పడం గొర్రె దాటు స్వభావమే కాదా.. అంటే కెసిఆర్ వచ్చిన తర్వాత ఇలా అహంకారంగా మాట్లాడే వాళ్లను ఎగేసి సభ నడవకుండా చేయాలని చెప్పి వెళ్ళాడేమో బహుశా...**

చట్టసభల్లో కనీసం మర్యాదలు కనీస బాధ్యత ప్రవర్తించే వారు ఎవరైనా సరే చట్టసభల్లో కూర్చునే అర్హతను కూడా పూర్తిగా తీసేయాలి. ఎలాంటి మర్యాద లేకుండా మాట్లాడిన మాటలను పరిగెలోకి తీసుకొని తన ఎమ్మెల్యే అభ్యర్థిత్వాన్ని కూడా శాశ్వతంగా తీసేసేల చర్యలు తీసుకోవాలి.. అసలు జగదీశ్ రెడ్డి మాట్లాడిన మాటలు తానేదో శుద్ధ పూసను అన్నట్టుగా తానే సీనియర్ నాయకుడిని అని అన్నట్టుగా ఆయన మాట్లాడిన మాట తీరు అధికార పక్షాన్ని శాసనసభను శాసనసభాపతిని అవమానపరిచేలా జరిగాయి... నిజానికి మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఎమ్మెల్యేగా శాసనసభలో కూర్చోవడానికి అర్హత ఏమీ లేదని రుజువు కాబడింది... చట్టసభల్లో ఇలాంటి దూషణలకు అసలు చోటు కల్పించకుండా ప్రజా సమస్యలపై ప్రజా సంక్షేమంపై జరగాల్సిన చర్చ సభ సమయాన్ని పూర్తిగా ఇలాంటి బుద్ధి సిగ్గులేని నేతల మాటలను పరిగణలోకి తీసుకొని సభను వాయిదా వేయడం ఇది ప్రజలకు నష్టాన్ని తెచ్చిపెడుతుంది అనడంలో ఎలాంటి సందేహం లేదు. చట్టసభల్లో మర్యాద తెలువని ప్రతి పక్ష నాయకులకు చట్టసభల్లో కూర్చుని అర్హత లేదని మరొకమారు రుజువు కాబడుతోంది..

# పంటలు ఎండినా పట్టింపు లేదా..?



**✍ జయభేరి, హైదరాబాద్ :**

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంవల్ల రాష్ట్రంలో పంటలు ఎండిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 56 లక్షల ఎకరాల్లో వరి, 7 లక్షల ఎకరాల్లో మొక్కొజొన్న పంటలు వేసినప్పటికీ.. ఆయా పంటలకు తగిన సమయంలో నీటిని వదలక పోవడంవల్ల ఇప్పటికే దాదాపు 10 లక్షల ఎకరాల మేరకు పంట ఎండిపోయినట్లు మా దృష్టికి వచ్చింది. ముఖ్యంగా ఆయకట్టు చివరి పంటలకు నీళ్లందక పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. అయినా ప్రభుత్వ యంత్రాంగం రైతులను ఆదుకునేందుకు, పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరం. వాస్తవానికి ఈ ఏడాది పుష్కలంగా వర్షాలు కురిసి ప్రాజెక్టులు, చెరువులు నిండిపోయాయి. ఫలితంగా వానా కాలంలో రికార్డు స్థాయిలో అంటే 160 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా వరి ధాన్యం దిగుబడి వచ్చింది. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని యాసంగి లోనూ 56లక్షల ఎకరాల్లో వరి, మరో 7 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు వేశారు. వీటితోపాటు జొన్న, పప్పుదాన్యాలు, నూనెగింజల పంటలు కూడా వేశారు.

యాసంగి పంటలు వేసేటప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరం చెప్పలేదు. యాసంగిలో ఏ ప్రాంతంలో ఏ పంట వేయాలనే అంశానికి సంబంధించి ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను కూడా వ్యవసాయ శాఖ అమలు చేయలేదు. మరో నెల రోజుల్లో పంటలు కోతకు రాబోతున్న తరుణంలో పొలాలకు నీరందక పోవడంవల్ల లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయి. చెరువుల్లో నీరు తగ్గడంతో భూగర్భ జలాలు పడిపోయి బావులు, బోర్ల కింద పంటలన్నీ ఎండి నేలరాలుతున్నాయి. ఇది ముమ్మాటికీ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమే. ఎందుకంటే శ్రీశైలం, నాగార్జున సాగర్, శ్రీరాం సాగర్, ఎల్లంపల్లి, ఎల్ఎండీ, సింగూరు సహా రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టుల్లో 340 టీఎంసీలకు పైగా నీటి నిల్వ ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. ఇందులో 150 టీఎంసీల మేరకు డెడ్ స్టోరేజీ పోగా, మరో 190 టీఎంసీలకు పైగా నీరు అందుబాటులో ఉంది. తాగునీటి అవసరాలకు మినహాయించి మిగిలిన నీటిని సకాలంలో విడుదల చేసి చెరువులు నింపినట్లయితే పంటలు ఎండిపోయే దుస్థితి తలెత్తేది కాదు. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యం, వ్యవసాయ శాఖ ప్రణాళిక లేమి కారణంగా నీళ్లున్నా వాడుకోలేక పోవడంవల్ల రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. ఎకరాకు రూ.30 వేలకుపైగా పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి సాగు చేస్తున్న రైతులకు మరో నెలరోజుల్లో పంట చేతికి అందే సమయంలో పైర్లు ఎండిపోవడమంటే నోటి కాడ ముద్దను నేల పాలు చేయడమే. ఎండిపోతున్న పంటలను రక్షించడానికి రైతులు ఆందోళనలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం మాత్రం మొద్దు నిద్రను వీడకపోవడం క్షమించరాని చర్య. పంటలు ఎండిపోయి పశువులకు మేపుకుంటున్నా, ఎండిన పంటను తగలబెడుతున్నా వ్యవసాయశాఖ మేల్కొకపోవడం, రైతుల పెట్టుబడి నష్టాన్ని గుర్తించక పోవడం బాధాకరం. పాలకుల నిర్లక్ష్యానికి రైతులు ఎందుకు మూల్యం చెల్లించాలి? ఇప్పటికే రైతు భరోసా సాయం అందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. రుణమాఫీ పూర్తిగా అమలు కాక 20 లక్షలకుపైగా రైతులు అప్పులు చెల్లించకలేక అల్లాడుతున్నారు. గతంలో పంట నష్టపోతే పరిహారం అందక అరిగోస పడుతున్నారు. రైతు రాజ్యమని బీరాలు పలికే కాంగ్రెస్ ప్రభుత్వం వీటికి ఏం సమాధానం చెబుతుంది? కాంగ్రెస్ మార్క్ రైతు సంక్షేమ రాజ్యమంటే ఇదేనా? కనీసం రైతులు పడుతున్న ఇబ్బందులపై అసెంబ్లీలో చర్చించాలనే ఆలోచన కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయకపోవడం దుర్మార్గం. రాష్ట్రానికి, దేశానికి అన్నం పెడుతున్న అన్నదాత అష్టకష్టాలు పడుతూ ఆత్మహత్యలు చేసుకుంటుంటే... వారి సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు కనుగొనడంతోపాటు వారికి అండగా ఉన్నామనే భరోసా ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా? ఈ అంశాన్ని కూడా కేంద్రంపైకి నెట్టేసి తప్పించుకోవాలనుకుంటున్నారా? ప్రభుత్వ అధినేతగా రాజకీయ నాయకుల స్టేచర్ గురించి మాట్లాడి మీడియాలో వార్తలకెక్కడం కాదు... ప్రభుత్వ అధినేతగా రైతుల ఫ్యూచర్ గురించి ఆలోచించి వారికి అండగా నిలవాలి.

తక్షణమే రాష్ట్ర రైతాంగం పడుతున్న ఇబ్బందులపై అసెంబ్లీలో చర్చించాలి. అసెంబ్లీ సాక్షిగా రైతులను ఆదుకునేందుకు ప్రకటన చేయాలి. మరింత నష్టం జరగకుండా వెంటనే ప్రాజెక్టులనుండి నీటిని విడుదల చేయాలని భారతీయ జనతా పార్టీ పక్షాన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం.

# భార్యలు తాగుతున్నారని పోలీస్ స్టేషన్లో భర్తల ఫిర్యాదు

**✍ జయభేరి, హైదరాబాద్:**

మా ఇంటాయన తాగు బోతు అయిపోయాడు సంసారం నాశనమై పోతుందని అడవాళ్లు ఆవేదన వ్యక్తం చేయడం సహజం. కానీ, ఇక్కడ మాత్రం మా ఆడాళ్లు తాగుబోతులైపోయారని, తమ కష్టాన్ని తాగుడుకే దారపోస్తున్నా రని, పురుష మా లోకం లబోదిబోమంటున్నారు. మద్యానికి బానిసలైన మా పెళ్లాలు తాము కూలి పనులు చేసిన సంపాదిస్తున్నదంతా సారాకు తాగేస్తున్నారని, మీరే తమను, తమ కుటుంబాలను ఆదుకోవాలని భర్తలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విస్మయానికి గురిచేసే ఈ సంఘటన ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలో వెలుగుచూసింది.

బొరిగుమ్మ సమితిలోని పూజారిపుట్ పంచాయతీ కొండగూడ గ్రామానికి చెందిన కొంత మంది వ్యక్తులు. తమ భార్యలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు గత నాలుగేళ్లుగా నాటు సారా తయారుచేస్తూ విక్రయిస్తు న్నారని తెలిపారు. ఊళ్లో మగాళ్లంతా కూలిపనులు చేస్తూ డబ్బులు సంపాది స్తుంటే.. అడవాళ్లు తమ కష్టాన్ని మద్యానికి ధారబోసేస్తున్నారని వాపోయారు. దీంతో కుటుంబాలు చిన్నాభిన్నమై తమ పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి వెళుతోందని వారికి ఏడుపు ఒక్కటే తక్కువయ్యింది. సారా తయారీ స్థావరాలపై దాడులు చేయాలని వారు కోరారు. పోలీ సులు ఆబ్కారీ అధికారుల దృష్టికి సమస్యను తీసు కెళ్లిన బాధితులు సారాను అడ్డుకోవాలని కోరారు.

# గ్రేవేయర్డ్ లకు, పార్కులకు నిధులు కేటాయిస్తాం

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, ఉప్పల్ :**

చిల్కానగర్ డివిజన్ లోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డితో కలిసి కార్పొరేటర్ మాజీ జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ శంకుస్థాపన చేశారు. చిల్కానగర్ డివిజన్లోని బాలాజీ ఎంక్లేవ్ పార్కులో కాంపౌండ్ వాల్ పెయింటింగ్, బెంచీలు, గార్డెన్ గ్రాసింగ్, గజాబొల ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జరిగింది. అదేవిధంగా చిల్కానగర్ డివిజన్లోని కుమ్మరి గ్రేవ్ యార్డ్ లో స్ట్రాం వాటర్ డ్రైన్ పైప్ లైన్, గ్రేవ్ యార్డ్ ఫ్లోరింగ్, స్టోర్ రూమ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే బండారి మాట్లాడుతూ చిల్కానగర్ డివిజన్ లోని అన్ని పార్కులకు, గ్రేవ్ యార్డ్ ల మౌలిక సదుపాయాల కొరకు ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నామని కొనియాడారు. అనంతరం కార్పొరేటర్ గీతా ప్రవీణ్ మాట్లాడుతూ.. చిల్కానగర్ డివిజన్లో అన్ని గ్రేవ్ యార్డ్ ల మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామని, డివిజన్లోని అన్ని పార్కులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారి సహకారంతో పార్కుల అభివృద్ధి, ఓపెన్ జిమ్ ల ఏర్పాటు తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తూ డివిజన్ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పూర్తి చేసుకుంటూ ముందుకు సాగుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, బాలాజీ ఎంక్వ్యా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జగదీశ్వర్ రెడ్డి, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కుమ్మరి సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు డివిజన్ మహిళా నాయకురాలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ని ప్రయివేటు పరం చేయడానికి తీసుకువస్తున్న విధానాలకు వ్యతిరేకంగా గురువారం ఉదయం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మరియు రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి నేతృత్వంలో హైదరాబాద్ లోని BRK భవన్ లో ఏర్పాటు చేసిన చర్చా సమావేశంలో పాల్గొని మార్కెట్ కమిటి ల పక్షాన అభిప్రాయాలను చెప్పిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి. ఈ సమావేశంలో వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యులు..వ్యవసాయ మార్కెటింగ్ మరియు మార్క్ ఫెడ్..పౌరసరపర శాఖ ల అధికారులు.. వివిధ రైతు సంఘాల నాయకులు పాల్గొని అభిప్రాయాలు చెప్పడం జరిగింది.

**జయభేరి, ఎల్బీనగర్**

## గోపాలమిత్ర సభ్యులకు అండగా ఉంటాం

- ఉమ్మడి మెదక్ గోపాలమిత్ర సభ్యులు
- గోపాల మిత్రుల ఆధ్వర్యంలో మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**జయభేరి, గజ్వేల్, మర్చి 13 :**

సిద్దిపేట జిల్లా సిద్దిపేట మండలానికి చెందిన గోపాల మిత్ర మార్గడి వెంకట్ రెడ్డి ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఉమ్మడి మెదక్ జిల్లా గోపాల మిత్ర సంఘం సభ్యుల ఆధ్వర్యంలో గురువారం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ఒక లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా గోపాల మిత్ర అధ్యక్షులు సింగం రాజు యాదవ్, రాష్ట్ర సలహాదారు శ్రీరాములు, సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, కోశాధికారి గౌరీ శంకర్, మెదక్ జిల్లా అధ్యక్షులు అశోక్, మెదక్ జిల్లా మాజీ అధ్యక్షులు రామస్వామి, సూపర్వైజర్ అబ్దుల్ సత్తార్, గోపాల మిత్రులు గౌరీ శంకర్, చంద్రశేఖర్, ఆంజనేయులు, శ్రీనివాస్, కృష్ణ, దేవరాజ్, తిరుపతి రెడ్డి,నర్సింలు, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

## ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలి

- Ecil కంపెనీ చైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ నీ కలిసిన ఈటల, బండారి

**జయభేరి, కాప్రా :**



ECIL కంపెనీ చైర్మెన్ & మేనేజింగ్ డైరెక్టర్ అనురాగ్ కుమార్ ని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి పలు సమస్యలు CSR ఫండ్స్ గురించి చర్చించిన మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల అభివృద్ధి, CC కెమెరాలు, అభివృద్ధికి నిధుల కోసం చర్చించడం జరిగింది. అలాగే ఉదయం,సాయంత్రం వాకింగ్ వారి కోసం ECIL ground అందుబాటులో ఉంచాలని కోరడం జరిగింది. వాకింగ్ చేసే వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కోరారు. సానుకూలంగా స్పందించి న ఎండీ వాకింగ్ చేసే వారికి ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తానని హామీ ఇవ్వడం జరిగింది. స్థానికులకు జాబ్స్ కావాలని కోరడం జరిగింది.

అలాగే ఎంప్లాయిస్ ప్రాబ్లమ్స్ కోర్టులో వున్నది అని దాని పరిష్కారానికి కృషి చేయాలని కోరారు సానుకూలంగా స్పందించిన ఎండీ తొందరలోనే సమస్య పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మహేష్ గౌడ్ ,BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## 15 నుంచి ఒంటిపూట బడులు

**జయభేరి, హైదరాబాద్, మార్చి 13:**

తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండనుంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ఒక్క పూట బడులపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు ఇచ్చింది. . 2025 మార్చి 15వ తేదీనుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు, ఎయిడెడ్ ఇతర అన్ని మేనేజ్మెంట్ల పరిధిలోని బడులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పాఠశాలు ఉంటాయని వెల్లడించింది. 12:30 మధ్యాహ్న భోజనం అందిస్తారని తెలిపింది. లాస్ట్ వర్కింగ్ డే ఏప్రిల్ 23 వరకూ హాఫ్ డే స్కూల్స్ కొనసాగనున్నాయి. అయితే.. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు కొనసాగే పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో సూచించారు. సెలవుల కోసం విద్యార్థులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం.. ఏప్రిల్ 24 నుంచి సెలవులు ప్రకటించి.. తిరిగి జూన్ 12 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు సమాచారం.

## జర్నలిస్టుల ఆరోగ్యాన్ని కాపాడండి

- అప్పులు చేసి చికిత్స పొందుతున్నారు
- డిప్యూటీ సియంతో టీయూడబ్ల్యూజే
- సానుకూలంగా స్పందించిన భట్టి

**జయభేరి, హైదరాబాద్ :**



గత ఐదేళ్లుగా రాష్ట్రంలో జర్నలిస్టుల ఆరోగ్య పథకం అమలుకాక పోవడంతో, అప్పులు చేసి చికిత్స పొందే పరిస్థితి నెలకొందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందే ఆర్థిక స్థోమత లేక ఇప్పటికే పలువురు జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) ప్రతినిధి బృందం వాపోయింది.

గురువారం నాడు అసెంబ్లీ లాబిలో ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం కలిసి జర్నలిస్టుల ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్ళింది.

గత ప్రభుత్వం 2015లో ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు అందించిన హెల్త్ కార్డులు కొంతకాలం ఎంతో ప్రయోజనం చేకూర్చాయని, గడిచిన ఐదేళ్లుగా ఆసుపత్రుల్లో అవి చెల్లకపోవడంతో, అనారోగ్యలకు గురవుతున్న జర్నలిస్టులు, వారి కుటుంబ సభ్యులు పడరాని తిప్పలు పడుతున్నట్లు విరాహత్ అలీ ఆవేదన వ్యక్తం చేశారు. జర్నలిస్టుల ఆరోగ్య పథకాన్ని సమర్థవంతంగా అమలుచేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల మెనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ పొందుపర్చడంతో జర్నలిస్టులు ఎంతో సంతోషపడ్డారాని ఆయన గుర్తుచేసారు. అయితే ఇంకా అది అమలుకాక పోవడంతో జర్నలిస్టులు నిరాశ చెందుతున్నట్లు ఆయన తెలిపారు. వెంటనే ఆరోగ్య పథకాన్ని అమలు పరిచి, జర్నలిస్టుల అకాల మరణాలను ఆపేందుకు చర్యలు చేపట్టాలని విరాహత్ అలీ కోరారు. అలాగే రాష్ట్రంలో జర్నలిస్టులు తమ విధులను సజావుగా నిర్వహించేందుకు, సంఘ వ్యతిరేక శక్తుల నుంచి వారికి రక్షణ కల్పించేందుకు, జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి ప్రభుత్వాలు అనేక జీవోలు తెచ్చి ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశాయని, రాష్ట్ర విభజన తర్వాత ఆ కమిటీలు నిర్వీర్యమై పోయినట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వేజ్ బోర్డు సిఫార్సుల అమలును పర్యవేక్షించే త్రైపాక్షిక కమిటీ, వర్కింగ్ జర్నలిస్ట్స్ వేల్ఫేర్ ఫండ్ కమిటీ, జర్నలిస్టులపై దాడుల నివారణకు హైపవర్ కమిటీతో పాటు ఇతర కమిటీలను పునరుద్దరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా వినతి పత్రాన్ని అందించారు. టీయూడబ్ల్యూజే వినతిపై డిప్యూటీ సియం భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టులకు ఎల్లప్పుడూ తన సహకారం ఉంటుందన్నారు. యూనియన్ ప్రతినిధి బృందంతో త్వరలో సమావేశమై సమస్యలపై కులంకుశంగా చర్చిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. డిప్యూటీ సియంను కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే ఉప ప్రధాన కార్యదర్శి కలుకూరి రాములు, జర్నలిస్ట్స్ హెల్త్ కమిటీ కన్వీనర్ ఏ.రాజేష్, హెచ్.యూ.జె అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్, ఐజేయు జాతీయ కౌన్సిల్ సభ్యుడు రజనీకాంత్ తో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.

## రాజారావు ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు



**జయభేరి, గజ్వేల్, మర్చి 13 :**

తెలంగాణ మలిదశ ఉద్యమంలో మహిళలందర్నీ ఏకం చేస్తూ స్వరాష్ట్ర సాధనలో తన వంతు పాత్ర పోషించిన తెలంగాణ రుద్రమ దేవి జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గ్రీన్ ఇండియా చాలెంజ్ జిల్లా అధ్యక్షులు రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రజ్ఞాపూర్ చౌరస్తాలో కేక్ కట్ చేసి రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి కవితక్కకి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎఫ్డిసి చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్సి రాజమౌళి బిఆర్ఎస్ యువ నాయకులు కాటుకళ్యాణ్ మాజీ ఆత్మ కమిటీ డైరెక్టర్ ఎల్లా వెంకట్, మధుర బోయిన కార్తీక్, బలమైన మహేష్,కోనమైన రమేష్, కోనమైన రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు వరంగా మారిన సీఎం రిలీఫ్ ఫండ్

- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణి చేస్తున్న టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు



**జయభేరి, ములుగు, మర్చి 13 :**

సీఎం సహాయనిధి పేదలకు ఎంతగానో మేలు చేస్తుందని టిపిసిసి అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్ రావు పేర్కొన్నారు. గురువారం ములుగు మండలంలోని మామిడ్యాల గ్రామంలోని జోగు కమలమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.సీఎం రిలీఫ్ ఫండ్ పరిహారంతో పేదలు కార్పొరేట్ వైద్యం పొందేందుకు వీలు కలుగుతుందని స్పష్టం చేశారు.అంతేగాకుండా వైద్యులు, వైద్య సిబ్బందిలో మార్పు తెచ్చే విధంగా ఆకస్మిక తనిఖీలు చేపడుతూ ప్రక్షాళన చేపట్టిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందని వివరించారు. ములుగు మండలం మామిడ్యాల కి చెందిన జోగు కమలమ్మకు 60 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కును టీపీసీసీ అధికార ప్రతినిధి అందజేశారు. ఈ కార్యక్రమంలో ములుగు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా, భూపాల్ రెడ్డి, మామిడ్యాల మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, నేతలు మల్లారెడ్డి,రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విరించి ఆసుపత్రిలో కిడ్నీ డే

**జయభేరి, హైదరాబాద్:**

దేశంలో మూత్రపిండాల సమస్యతో బాధపడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు డాక్టర్ కెఎస్ నాయక్ అన్నారు .హైదరాబాద్ బంజారాహిల్స్ విరించి హాస్పిటల్ లో వరల్డ్ కిడ్ని డేను ఘనంగా నిర్వహించారు . మూత్రపిండాల మార్పిడి చేయించుకుని కోలుకున్న వ్యక్తులు ...తల్లి ,కుమారుడు , భార్య,భర్త బ్లడ్ గ్రూపులు వేరుగా ఉన్నా మూత్రపిండాలు మార్పిడి చేసి చికిత్స అందించినట్లు ఆయన తెలిపారు .దేశంలోమొదటి సారి ప్రపంచ కిడ్ని దినోత్సవం రోజున ఒకే దాత నుండి కాలేయం ,మూత్రపిండం మార్పిడి చేసినట్లు ఆయన వెల్లడించారు.

## ఘనంగా శ్రీ శ్రీ శ్రీ ఆతుకూరి మొల్లమాంబ జయంతి వేడుకలు

**జయభేరి, కొండమల్లేపల్లి :**



కుమ్మరి శాలివాహన సంఘం దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు తోటపల్లి కిరణ్, కుమ్మరి శాలివాహన సంఘం కొండమల్లేపల్లి మండల కన్వీనర్ ఏరుకొండ రాము ఆధ్వర్యంలో గురువారం కొండమల్లేపల్లి చౌరస్తాలో ప్రముఖ కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ గారి జయంతి వేడుకను ఘనంగా నిర్వహించారు. కవయిత్రి మొల్ల గారి చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయలు కొట్టి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొల్ల కుమ్మరి కులంలో ఆంధ్రప్రదేశ్ లోని కడప జిల్లాలో గోపవరం అనే గ్రామంలో కేసన శెట్టి కుటుంబంలో జన్మించిందని అన్నారు. తల్లి చిన్నతనంలోనే తల్లి చనిపోవడంతో తండ్రీ కేసన సంరక్షణలో ఆమె పెరిగింది అన్నారు. తండ్రి శివ భక్తుడు కావడంతో ఆమె చిన్నతనం నుండి దైవానుగ్రహంతో ముందుకెళ్ళిందని ,తనకు శాస్త్రీయ విద్యతో కాకుండా భగవద్దత్తమైన వర ప్రసాదం వల్లనే కవిత్వంలో రాణించిందన్నారు. సంస్కృతంలో వాల్మీకి రచించిన రామాయణాన్ని తెలుగులో సరళమైన భాషలో రాసిన ఘనత ఆమెకే దక్కిందన్నారు. అప్పటినుండి మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. మొల్లమాంబ 1440 నుండి 1530 కాలంలో 16వ శతాబ్దానికి చెందిన ప్రముఖ కవిగా ప్రాచుర్యం పొందిందన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాలంలో తన కవిత్వాన్ని చూపిందన్నారు .మొల్ల ఏ విధమైన సంప్రదాయ విద్యను నేరవకుండా దైవాంశ అనుగ్రహంతో రామాయణాన్ని తెలుగులో రాసిందని ,అట్టి రామాయణం ఆరుకాండములలో ఎనిమిది వందల డెబ్బై పద్యాలతో రచింపబడిందన్నారు. తాను రచించిన రామాయణాన్ని ఆ కాలంలో కవుల లాగా మణులకు, మాణిక్యాలకు, కీర్తి ప్రతిష్టలకు అమ్ముకోలేదని సాక్షాత్తు శ్రీరామచంద్రుడికి అంకితం చేసిందన్నారు. ఆ రోజుల్లో వీర వనితగా అగ్రవర్ణాల చేతిలో అణిగిపోతున్న ,వివక్షకు గురవుతున్న వెనకబడిన జాతుల పక్షాన నిలబడి వారిని చైతన్యం చేసింది అని అన్నారు. అలాంటి గొప్ప కవి మా కుమ్మరి కులంలో పుట్టడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఆ రోజుల్లోనే సనాతన ధర్మాన్ని ఎంతగానో ప్రచారం చేసిందన్నారు. కవి రత్న బిరుదు కూడా ఆమెకు లభించిందన్నారు. ఇటీవల భారత ప్రభుత్వం రెవెన్యూ స్టాంప్ కూడా ఆమె పేరున విడుదల చేయడం అభినందనీయమన్నారు. భావితరాలకు కవయిత్రి మొల్లమాంబ గారి చరిత్రను తీసుకెళ్తామని అన్నారు. అందరూ ఆమె అడుగుజాడల్లో నడవాలన్నారు. మహిళలపై వివక్ష చూపుతున్న ఆ రోజులలో ధైర్యంగా సమస్యలను ఎదుర్కొని గుర్తింపు పొందిన వీరవనితను ప్రస్తుత మహిళలందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమానంతరం పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు ,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమన్ రెడ్డి , మాజీ సర్పంచ్ మాడుగుల యాదగిరి, బొడ్డుపల్లి సైదులు, ఎలిమినేటి సాయి, బొడ్డుపల్లి ఎల్లయ్య, బొడ్డుపల్లి మల్లయ్య, తోటపల్లి వెంకటయ్య, బొడ్డుపల్లి యాదగిరి, తోటపల్లి కలమ్మ, బొడ్డుపల్లి ధనమ్మ, తోటపల్లి శ్రీను ,బొడ్డుపల్లి రమేష్ గణపురం రాంబాబు, తోటపల్లి శ్రీనివాస్, బత్తుల జంగయ్య, బొడ్డుపల్లి బాలకృష్ణ, బొడ్డుపల్లి నిరంజన్, గణేష్ ,బొడ్డుపల్లి నరేష్, నాగేష్ ,వెంకటేష్, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ జన్మనిచ్చిన.. అభివృద్ధికి ప్రాధాన్యత..

- ఆర్థిక కష్టాలున్నా పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి సీఎం రేవంత్ రెడ్డి పెద్దపీట
- రాష్ట్రంలో.. అద్భుత ప్రగతికి బాటలు వేస్తున్న కాంగ్రెస్ సర్కార్
- డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

జయభేరి, వర్గల్, మర్చి 13 :



రాజకీయ జన్మనిచ్చిన వర్గల్ కు జీవితాంతం రుణపడి ఉంటానని, ఇక్కడి ప్రజల సంక్షేమం, అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని డిసిసి అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం వర్గల్ ఎస్సీ వాడలో రూ 40 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వ పాపాలు గజ్వేల్ పాలిట శాపాలుగా మారగా, గద్దలకు దోచిపెట్టే పనులు చేసి నిధులను దుర్వినియోగం చేసినట్లు ఆరోపించారు. గజ్వేల్ నడిబొడ్డున కేవలం పెద్ద పెద్ద భవనాలు నిర్మించి అభివృద్ధి పేరిట ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు విమర్శించారు. గజ్వేల్ సమస్యలపై మాట్లాడని ఇక్కడి ఎమ్మెల్యే కెసిఆర్ ను ఫాంహౌజ్ కే పరిమితం చేయాలని సూచించారు. ముఖ్యంగా రాష్ట్రంలో ఆర్థిక కష్టాలు అధిగమిస్తూ సీఎం రేవంత్ రెడ్డి అద్భుత ప్రగతి సాధిస్తుండగా, అడిగిన వెంటనే గజ్వేల్ నియోజకవర్గ అభివృద్ధికి రూ 5 కోట్లు కేటాయించినట్లు స్పష్టం చేశారు. దీర్ఘకాలిక, శాశ్వత ప్రయోజనాలు లక్ష్యంగా గజ్వేల్ అభివృద్ధి కోసం రూ 200 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపించినట్లు తెలిపారు. సకల జనుల సంక్షేమం లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రక పథకాలు రూపొందించి అమలు చేస్తుండగా, త్వరలోనే అర్హులైన పేదలందరికీ రూ 5 లక్షల వ్యయంతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రేషన్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. అంతేగాకుండా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో మల్లన్న సాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ల నుండి పంటలకు సాగునీరు అందించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వ అవినీతి, అక్రమాలు ఒక్కొక్కటిగా బయట పడుతుండడంతో జీర్ణించుకోలేకపోతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ అధ్యక్షులు సందీప్ రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గజ్వేల్ ప్రవీణ్ గౌడ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రమేష్ ముదిరాజ్, పట్టణ పార్టీ అధ్యక్షులు బాల్రెడ్డి, నేతలు శ్రీనివాస్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మహేందర్ గౌడ్, కిషన్ గౌడ్, పొన్నాల నర్సారెడ్డి, గణేష్ చారి తదితరులు పాల్గొన్నారు.



## మృతుని కుటుంబానికి అండగా నిలిచిన కాంగ్రెస్ నాయకుడు

జయభేరి, ములుగు, మర్చి 13 :

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు కాంగ్రెస్ నాయకులు. వివరాల్లోకెళ్తే ములుగు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన గడీల యాదగిరి అనారోగ్యంతో మరణించారు., ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పరుపుని అశోక్ వారి కుటుంబాన్ని పరామర్శించి వారికీ ఆర్థిక సాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటానంటూ సహాయం చేయడంలో ఎంతో ఆనందం ఉందన్నారు. అలాగే మృతుని కుటుంబానికి ధైర్యం తెలియజేశారు.వారి వెంట గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## టోర్నమెంట్ కు అండర్ 14 క్రీడాకారులు



జయభేరి, గజ్వేల్, మర్చి 13 :

వనపర్తి జిల్లా కేంద్రంలోని జరిగే ఈ నెల 14 నుండి 16 వరకు డాక్టర్ బాలకిష్టయ్య క్రీడాప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ టోర్నమెంట్ కు అండర్ 14 బాల & బాలికల ఫుట్ బాల్ టౌర్నమెంట్ కు ఉమ్మడి మెదక్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు గజ్వేల్ ఫుట్బాల్ క్లబ్ నుండి నిశ్చిత, అక్షిత్, పవన్, మారుతి మరియు మహాత్మ జ్యోతిరావు పూలే వర్గల్ రెసిడెన్షియల్ స్కూల్ నుండి ఎంపికైన క్రీడాకారులు నీతిశ, వసంత, మనుశ్రీ, లహరికలు కోచ్ రాంగారి నర్సింలు సమక్షంలో వనపర్తికి బయల్దేరి వెళ్లడం జరిగినది అని సిద్దిపేట జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్ గారి గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ రాష్ట్రస్థాయి టోర్నమెంట్లో మంచి ప్రతిభ ప్రదర్శించి ఆటోలో గెలుపు కృషి చేయాలని పిలుపునిచ్చారు క్రీడలో మంచి ప్రతిభ కనబరిచిన భవిష్యత్తులో జాతీయస్థాయిలో ఎదగడానికి, ఉన్నత విద్యకు మరియు ఉద్యోగాలలో ప్రోత్సాహకాలు ఉంటాయని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో క్లబ్ సభ్యులు చక్రపాణి గౌడ్, సందబోయిన ఎల్లయ్య తదితరులు పాల్గొనడం జరిగినది.

## గొర్లివానిపాలెం విద్యుత్ సమస్యలపై వినతి పత్రం అందజేత



జయభేరి, పరవాడ:

ఆంధ్ర ప్రదేశ్ ఈ.పి.డి.సి.ఎల్ సంస్థ పర్యవేక్షణలో కన్స్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెస్సెల్ ఫోరం ఆధ్వర్యంలో అనకాపల్లి జిల్లా పరవాడ మండలంలో గురువారం నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ సమస్యల పరిష్కార కార్యక్రమానికి హాజరైన చైర్ పర్సన్ రిటైర్డ్ జడ్జి డాక్టర్ బి. సత్యనారాయణకి పరవాడ మండలం గొర్లివానిపాలెం గ్రామం 1వ వార్డ్ విద్యుత్ వినియోగదారులు గురువారం వినతి పత్రం సమర్పించారు.కసింకోట సబ్ డివిజన్ పరవాడ సెక్షన్ కార్యాలయం పరిధిలో ఉన్న గొర్లివాని పాలెం గ్రామం 1వార్డులో విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న హెచ్చు తగ్గులు కారణంగా గృహోపకరణాలకు జరుగుతున్న నష్టాన్ని నివారించుటకు తగు చర్యలు తీసుకోవాలి కోరారు. ప్రస్తుతం నడుస్తున్న సింగిల్ ఫేస్ విద్యుత్ లైన్ కు అదనంగా రెండు ఫేసుల విద్యుత్ లైన్ ఏర్పాటు చేయుటకు తగు ఆదేశాలు ఇప్పించాలని వినతిపత్రంలో కోరారు. గొర్లివానిపాలెం 1వ వార్డు పరిధిలో ఉన్న విద్యుత్ వినియోగదారులంతా విద్యుత్ సరఫరా లో హెచ్చుతగ్గులు కారణంగా చాలా కాలంగా గృహోపకరణాలకు జరుగుతున్న నష్టాన్ని భరిస్తున్నారని, విద్యుత్ సంస్థ వారికి అనేక దఫాలుగా తెలిపినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని విన్నవించారు. తమ అభ్యర్థనను పరిశీలించి విద్యుత్ వినియోగదారుల గృహోపకరణాలకు జరుగుచున్న నష్టాన్ని నివారించుటకు సంబంధిత అధికారుల వారికి తగు ఆదేశాలు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు .ఈ కార్యక్రమంలో చిప్పాడ రామారావు, టి. గోవిందరావు, పి.అప్పారావు, సి.హెచ్. అప్పారావు, పి.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వేద పాఠశాలలో ఘనంగా హోలీ సంబరాలు



జయభేరి, పరకాల, మార్చి 13:

పెద్దకోడపాక గ్రామంలోని శ్రీ వేద పాఠశాలలో గురువారం ముందస్తుగా హోలీ సంబరాలు స్కూల్ ప్రధానోపాధ్యాయుడు విజయ్ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థులు జాజిరి ఆటలు ఆడి హోలీ సంబరాల్లో రంగురంగుల కలర్లు చల్లుకొని నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు విజయ్ మాట్లాడుతూ విద్యార్థులకు మన సంస్కృతి సాంప్రదాయాల గురించి వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వేద, ప్రియాంక, కీర్తి రెడ్డి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అరుణాచల క్షేత్రంలో చల్లా దంపతులు

జయభేరి, పరకాల, మార్చి 13:

తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచల క్షేత్రంలో అగ్నిలింగ రూపంలో అవతరించిన ఆ పరమేశ్వరుడిని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి జ్యోతి దంపతులు దర్శించుకున్నారు. మొదటగా గిరి ప్రదక్షణ చేసి అనంతరం స్వామీ వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పంచభూతలింగ క్షేత్రాలలో ఒకటిగా అరుణాచలంలో అగ్నిలింగ రూపంలో వెలసిన ఆ పరమేశ్వరుడిని ధరించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆ పరమశివుడి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.

# ఆంజనేయుడు రాముని జపం చేస్తే.. రేవంత్ రెడ్డి మాత్రం కేసీఆర్ జపం చేస్తుండు..!

- హామీలు అమలు చేయమంటే.. కెసిఆర్ పై మూర్ఖపు వ్యాఖ్యలు సిగ్గుచేటు
- విజ్ఞతతో.. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన శాస్తి చేస్తారు
- అప్పుడు చేసినా.. అభివృద్ధి ఫలాలు అనుభవిస్తున్న రాష్ట్ర ప్రజలు
- కాంగ్రెస్ అప్పు చేసిన రూ లక్ష 50 వేల కోట్ల ఖర్చు వివరాలు ప్రజలకు చెప్పాలి
- రాష్ట్ర పరువు తీస్తున్న సీఎం రేవంత్ రెడ్డి
- ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

జయభేరి, గజ్వేల్, మర్చి 13 :



ఆంజనేయుడు రాముని జపం చేయగా రేవంత్ రెడ్డి మాత్రం కెసిఆర్ కేటీఆర్ హరీష్ రావుల జపం చేస్తున్నారని,రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బిఆర్ఎస్ ప్రజా సమస్యలపై నియదీస్తుంటే కాంగ్రెస్ నేతలు మాజీ సీఎం కేసీఆర్ పై మూర్ఖపు వ్యాఖ్యలు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం గజ్వేల్ లో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో సకల జనులు సంతోషంగా ఉండగా, పాడిపంటలు సంవృద్ధిగా పండినట్లు స్పష్టం చేశారు. అయితే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి చేయకుండానే గత 15 నెలల వ్యవధిలో రూ లక్షా 50 వేల కోట్లు అప్పు చేయగా, ఆ లెక్కలు ప్రజలకు తెలపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేకతపై విజ్ఞులైన ప్రజలు సీఎం రేవంత్ రెడ్డి పనితీరును గమనిస్తున్నట్లు చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆర్థిక పరిస్థితులు మెరుగుపర్చుకుంటూ 11 ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టగా, వాటి అభివృద్ధి ఫలాలను రైతులు, ప్రజలు పొందుతున్నట్లు స్పష్టం చేశారు. కాగా ఎన్నికల సందర్భంగా అరచేతిలో వైకుంఠం చూపిన కాంగ్రెస్ ను ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రజలు నిలదీస్తుండగా, ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నట్లు విమర్శించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి తన పనితీరు, పద్ధతి, పాలన విధానం మార్చుకొని ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జకియొద్దిన్, మాజీ జెడ్పిటిసి రామచంద్రం, మండల పార్టీ అధ్యక్షులు బెండ మధు, పట్టణ పార్టీ అధ్యక్షులు నవాజ్ మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ పూడేం కృష్ణా రెడ్డి, నాయకులు, మాజీ కౌన్సిలర్లు వంటేరు గోపాల్ రెడ్డి, మర్కంటి కనకయ్య, శివకుమార్, గంగిశెట్టి రవి, మద్దూరి శ్రీనివాస్ రెడ్డి, ఆకుల దేవేందర్, భూపాల్ రెడ్డి, రఘుపతి రెడ్డి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి 15%నిధులు కేటాయించాలి

- పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి
- గజ్వేల్ పట్టణ, మండల బిజెపి అధ్యక్షులు మనోహర్ యాదవ్, అశోక్ గౌడ్

జయభేరి, గజ్వేల్, మర్చి 13 :



గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ బిజెపి అధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్, గజ్వేల్ మండల అధ్యక్షులు పంజాల అశోక్ గౌడ్ లు మాట్లాడుతూ ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ లో విద్యారంగానికి 15% నిధులు కేటాయించాలని, పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందినీ వెంటనే భర్తీ చేయాలని, యూనివర్సిటీల బడ్జెట్ మేరకు బ్లాక్ గ్రాంట్ ను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఏ వాగ్దానాన్ని విజయవంతంగా అమలు చేయలేదు! చేయనటువంటి పనులు చేసినట్టు గొప్పలు చెప్పుకునే ప్రయత్నం చేశారు తప్ప, కాంగ్రెస్ గెలిచి గద్దెనెక్కి ప్రజలకు ఉపయోగపడే పని ఏ ఒక్కటి చేయలేదు అధికారంలోకి వచ్చే ముందు తెలంగాణలో అమలు చేస్తామన్న 6 గ్యారెంటీలు 420 హామీలను నెరవేర్చకుండా, అసెంబ్లీలో గవర్నర్ గారితో కాంగ్రెస్ అసత్యపు మాటలు చెప్పించారు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పై వస్తున్న వ్యతిరేకతను తట్టుకోలేక.. ఘడీకి ఢిల్లీకి ఉరుకుతున్న రేవంత్ రెడ్డి గారు వఅక్కడనే ఒక సచివాలయం కట్టుకుంటే మంచిది అన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు చేప్యాల వెంకట్ రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు మద్దురి నర్సింహా ముదిరాజ్, నాయిని సందీప్ కుమార్, మైస విజయ్, భీం కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సిజిఆర్ ఎఫ్ ద్వారా విద్యుత్ సమస్యలపై అర్జీలకు 60 రోజుల్లో పరిష్కారం

- సిజిఆర్ఎఫ్ చైర్మన్ డా.సత్యనారాయణ

జయభేరి, పరవాడ:



విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార న్యాయస్థానం (సిజిఆర్ ఎఫ్) ద్వారా విద్యుత్ సమస్యలపై వచ్చిన అర్జీలను 60 రోజుల్లో పరిష్కరిస్తామని సిజిఆర్ఎఫ్ చైర్మన్,రిటైర్డ్ జడ్జి డా.బి సత్యనారాయణ తెలిపారు.ఈ మేరకు పరవాడ జేఎన్ పీసి సెక్షన్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన విద్యుత్ సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని మాట్లాడారు.వినియోగదారుడు తమ సమస్యలపై లిఖిత పూర్వక పిర్యాదు అందజేయాలన్నారు. ముందుగా వినియోగదారుడు సమస్యపై 1912 కి కాల్ చేయాలని,కాల్ చేసినప్పటికీ సమస్యపై అధికారులు స్పందించకపోతే చైర్ పర్సన్,సిజిఆర్ ఎఫ్ ఏపిఈపిడీసిఎల్,విశాఖ పట్నం కార్యాలయంకు లిఖితపూర్వక పిర్యాదును పంపించాలని తెలిపారు.మీ పిర్యాదును రిజిస్టర్ చేసి మీ సమస్యను సంబంధితశాఖకు తెలియజేసి సమస్యను 60 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. ప్రధానంగా లో ఓల్టేజ్,మీటరు కాలిపోయిన,బిల్లుల్లో లోపాలు,ట్రాన్స్ఫర్మర్, కొత్త సర్వీసులు,నేమ్ చేంజింగ్ ,అదనపు లోడు వంటి విద్యుత్ కు సంబంధించిన సమస్యలు మాత్రమే సిజిఆర్ ఎఫ్ లో పరిష్కరించబడతాయన్నారు.సమస్య ఉత్పన్నం అయిన రెండు సంవత్సరాలలోపు మాత్రమే సిజిఆర్ ఎఫ్ కు రావాలని,రెండు సంవత్సరాలు దాటితే ఆ కేసులను సిజిఆర్ ఎఫ్ తీసుకోదని తెలిపారు. అలాగే కరెంట్ దొంతనం,కోర్టు పరిధిలో ఉన్న విద్యుత్ కేసులు కూడా సిజిఆర్ ఎఫ్ టేకప్ చేయదని తెలిపారు. అనంతరం విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి అర్జీలను స్వీకరించారు.ఈ కార్యక్రమంలో సిజిఆర్ ఎఫ్ ఆర్థిక సభ్యులు షేక్ బాబర్,స్వతంత్ర సభ్యులు ఎన్ మురళీకృష్ణ,ఏపిఈపిడీసీఎల్ ఏడిఈ కనకారావు,ఏఈలు శేషసాయి,శివకుమార్,ఎల్ఐలు,విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.




## ఆర్డిఓ కు వినతి పత్రం

- మాజీ సర్పంచ్ పొనుగోటి రవీందర్ రావు

జయభేరి, డిండి :

సింగరాజు పల్లి గ్రామం లో రేషన్ షాపులో బయోమెట్రిక్ నమోదు సౌకర్యం లేకపోవడం వల్ల రేషన్ తీసుకోవడంలో ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని సింగరాజుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ పొనుగోటి రవీందర్ రావు RDO రమణారెడ్డి కి వినతి పత్రం అందజేసినారు. ప్రస్తుతం సింగరాజుపల్లి రేషన్ షాపులో బయోమెట్రిక్ నమోదు సౌకర్యం అందుబాటులో లేకపోవడం వల్ల వలస వెళ్లిన కూలీలు రేషన్ పొందలేకపోతున్నారు. దీని వలన వారు ఆహార భద్రతకు దూరమవుతున్నారు. కావున, మా గ్రామంలో రేషన్ షాపులో తక్షణమే బయోమెట్రిక్ నమోదు సౌకర్యం కల్పించాలని వినయపూర్వకంగా RDO రమణా రెడ్డిని కోరడం జరిగింది.

## జడ్జి ముందు పోసాని కన్నీళ్లు



జయభేరి, విజయవాడ, మార్చి 13:

సినీ నటుడు, వైసీపీ మాజీ నేత పోసాని కృష్ణ మురళి అరెస్ట్ ఇటు సినీ రంగంలోనే కాదు.. అటు రాజకీయాల్లో కూడా సంచలనం సృష్టించింది. జైలులో అడుగుపెట్టినప్పటి నుండి పోసాని అనారోగ్య సమస్యలతో బాధపడుతూనే ఉన్నారు. ఫైనల్గా జడ్జి ముందు ఆయనను హాజరు పరిచారు పోలీసులు. గుంటూరు జిల్లాలోని జడ్జి ముందు ఆయన హాజరు పరిచిన సమయంలో పోసాని బోరున విలపించారు. తన అనారోగ్య పరిస్థితి గురించి జడ్జితో చెప్పి కన్నీళ్లు పెట్టుకున్నారు. బెయిల్ మంజూరు అయ్యేలా చేయమని, ఈ పరిస్థితుల్లో బెయిల్ రాకపోతే ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు పోసాని కృష్ణమురళి. అసలు ఇదంతా ఎలా జరిగిందో వివరించారు.తనపై ఉన్న వ్యక్తిగత కోపంతోనే ఇలా తనపై ఫిర్యాదు చేశారని టీడీపీ అధికార ప్రతినిధిపై ఆరోపణలు చేశారు పోసాని కృష్ణమురళి. ఇక తన ఆరోగ్యం పరిస్థితి గురించి చెప్తూ.. ప్రస్తుతం తన ఆరోగ్యం అస్సలు బాలేదని, రెండుసార్లు ఆపరేషన్ చేసి స్టంట్లు వేశారని జడ్జితో వివరించారు. ఇక ఇరువైపులా వాదనలు విన్న తర్వాత పోసానికి 14 రోజుల రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేశారు న్యాయమూర్తి. దీంతో వెంటనే పోలీసులు.. పోసాని కృష్ణ మురళిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు. అలా మరోసారి కోర్టులో పోసానికి ఎదురుదెబ్బే తగిలింది. అనారోగ్య సమస్యలను కారణంగా చూపిస్తే బెయిల్ మంజూరు అవుతున్న పోసాని మరో 14 రోజల పాటు గుంటూరు జిల్లా జైలులో ఉండక తప్పదని తెలుస్తోంది.పోసాని కృష్ణ మురళి తరపున మాజీ ఏఏజీ పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. మరోవైపు సీఐడీ దాఖలు చేసిన పీటీ వారెంట్ను కొట్టివేయాలని పోసాని దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్ను హైకోర్టు కొట్టివేసింది. అలా పోసానికి అనుకూలంగా ఏ తీర్పూ రాలేదు. ఇక తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల పోసాని కృష్ణ మురళిపై కేసులు నమోదయ్యాయి. అయినా దాదాపు అన్ని కేసుల్లోనూ ఆయనకు బెయిల్ మంజూరు అయ్యింది. దీంతో అంతా ఓకే అని, బుధవారం పోసాని రిలీజ్ ఖాయమని కుటుంబ సభ్యులతో పాటు వైసీపీ నేతలు కూడా నమ్మారు. కానీ వారందరితో పాటు పోసానికి కూడా గుంటూరు కోర్టు ఝలక్ ఇచ్చింది. మళ్లీ తనను రిమాండ్కే తరలించింది. ఒకవేళ గుంటూరు కోర్టు నుండి పోసాని కృష్ణ మురళికి బెయిల్ మంజూరు అయినా.. మరో పోలీస్ స్టేషన్ నుండి పోలీసులు వచ్చి పీటీ వారెంట్పై పోసానిని అరెస్ట్ చేసే అవకాశాలు చాలానే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న పరిస్థితులు చూస్తుంటే పోసాని.. ఇంకా ఎంతకాలం ఈ జైలు జీవితాన్ని గడుపుతారో క్లారిటీ లేదు. ఒక దగ్గర బెయిల్ మంజూరు అయినా మరొక దగ్గర ఆయన కోసం పోలీసులు ఎదురుచూస్తూనే ఉంటారు అనే పరిస్థితి ఏర్పడింది. ఈ విషయం ఆయనకు కూడా క్లారిటీ వచ్చింది కాబట్టి బుధవారం గుంటూరు కోర్టులో హాజరయినప్పుడు ఆయనకు ఎలాగైనా బెయిల్ మంజూరు చేయమని కంటతడి పెట్టుకున్నారు పోసాని. అయినా ఆయనపై సెంటిమెంట్ వర్కవుట్ అవ్వలేదు.

# తండేల్ దర్శకుడితో రామ్ సినిమా..?..

హీరో రామ్ ప్రస్తుతం మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో ఓ సినిమా చేస్తున్న విషయం తెలిసిందే. 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' ఫేమ్ మహేష్‌బాబు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం రాజమండ్రిలో షూటింగ్ జరుగుతున్నది. ఇదిలావుండగా తాజాగా రామ్ మరో చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. దీనిని చందు మొండేటి డైరెక్ట్ చేస్తారని సమాచారం. ఇటీవల 'తండేల్'తో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు చందూ మొండేటి. ఆయన తదుపరి చిత్రాన్ని తమిళ హీరో సూర్యతో చేయాల్సి ఉంది. కథా చర్చలు కూడా పూర్తయ్యాయి. అయితే ప్రస్తుతం సూర్య వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన డేట్స్ కోసం వెయిట్ చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈలోగా రామ్‌తో ఆయన సినిమా చేసే ప్రయత్నాల్లో ఉన్నారని తెలిసింది. ఇటీవలే రామ్‌ని చందూ మొండేటి కలిసి ఓ కాన్సెప్ట్ చెప్పారని, అది బాగా నచ్చడంతో రామ్ సినిమా చేయడానికి ఉత్సాహంగా ఉన్నారని ఫిల్మ్ సర్కిల్స్‌లో వినిపిస్తున్నది. మైత్రీ మూవీ మేకర్స్ సినిమా పూర్తయ్యాక చందూ మొండేటి సినిమా పట్టాలెక్కే అవకాశముందని సమాచారం.





# మిమ్మల్ని పెళ్లి చేసుకొని మీకు..

తమిళనాడుకి చెందిన మాళవిక మోహనన్ డస్కీ లుక్స్ లో కనిపిస్తూ మంచి బోల్డ్ నెస్ ని కనబరుస్తుంది. ఇలా సౌత్ నుంచి హిందీ సినిమాకి కూడా మాళవిక మోహనన్ క్రేజ్ పాకింది. ఆ మధ్య పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాలో ఉందని వచ్చిన రూమర్స్ తో తెలుగు ఆడియెన్స్ లో బాగా వైరల్ అయ్యింది. ప్రస్తుతం తన డెబ్యూ తెలుగు సినిమాగా రెబల్ స్టార్ ప్రభాస్, మారుతీ కలయికలో ది రాజా సాబ్ అనే ప్రాజెక్ట్ చేస్తుంది. ఈ సినిమాతో తెలుగులో పాతకు పోవాలని చూస్తుంది. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ ముద్దుగుమ్మ తాజాగా అభిమానులతో ముచ్చటించింది . అభిమానులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చింది. ఈ క్రమంలో ఓ క్రేజీ అభిమాని మాళవికాను పెళ్లి చేసుకుంటానని అన్నాడు. దానికి మాళవిక ఆసక్తికర సమాధానం ఇచ్చింది. మిమ్మల్ని పెళ్లి చేసుకుంటా.. మీరు కోరుకునే భర్త.. మంచి భర్తగా ఉండేందుకు ఏం చేయాలి.. ది బెస్ట్ హజ్బెండ్‌లా ఉండాలని అనుకుంటున్నాను దీనికి మీ సమాధానం ఏంటని అడగగా, అందుకు మాళవిక ఆసక్తికర సమాధానం ఇచ్చింది. నేను ఇప్పుడు పెళ్లికి సిద్దంగా లేను.. ఇప్పుడు నాకు భర్త వద్దు అని పేర్కొంది. ఓ నెటిజన్ జాంబీగా మారితే ఏ హీరోతో ఉంటావ్ అని అడగగా, దానికి ప్రభాస్ పేరు చెప్పింది. ప్రభాస్ అయితే పక్కన ఉన్న వారికి సరిపోయేంత ఫుడ్ తీసుకొస్తాడు కాబట్టి జాంబీగా మారినప్పుడు ఇక నేను ఫుడ్ కోసం వెతుక్కోవాల్సిన పని ఉండదు అంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్ చేసింది మాళవిక.



# ఇది చాలా సెన్సిటివ్ ఇష్యూ..

పైకి కనిపించేంత అందంగా సినిమా తారల జీవితాలుండవు అనేది దగ్గరగా చూసిన వారికే తెలుస్తుంది. ఒక్కసారి సినిమాకు సైన్ చేశాక.. పారితోషికం అందుకున్నాక.. ఇక ఆ సినిమాకోసం ఎంతైనా కష్టపడాల్సిందే. పాత్రలో ప్రాణం పోసేందుకు ఎంతకైనా తెగించాల్సిందే. అందులో హీరోయిన్లేం మినహాయింపు కాదు. గర్భం దాల్చి కూడా యాక్షన్ సన్నివేశాల్లో నటించిన కథానాయికలు ఉన్నారు. అందుకు ఉదాహరణే దీపికా పదుకొణ్, అలియాభట్. నిండు గర్భంతో సినిమా ప్రమోషన్స్‌కు కూడా వారు హాజరైన విషయం తెలిసిందే. ప్రస్తుతం వారినే అనుసరిస్తున్నది మరో బాలీవుడ్ భామ కియారా అద్వానీ. ప్రస్తుతం కైరా గర్భవతి. కానీ విశ్రాంతి తీసుకునే పరిస్థితి లేదు. ఆమె చేతిలో రెండు సినిమాలు ఉన్నాయి. అందులో ఒకటి 'వార్ 2' కాగా, రెండోది కన్నడ సినిమా 'టాక్సిక్'. రెండూ భారీ మాస్ సినిమాలే. రెండింటిలో ఆమె యాక్షన్ సీన్స్‌లో నటించాల్సి వుంది. ఈ రెండు సినిమాల్లోని తన పార్ట్‌ని పూర్తి చేయాల్సిన బాధ్యత కూడా ప్రస్తుతం ఆమెపై ఉంది. అందుకే.. గర్భం దాల్చి కూడా షూటింగుల్లో పాల్గొంటున్నది కియారా. ఈ విషయంపై ఆమె మాట్లాడుతూ 'ఇది చాలా సెన్సిటీవ్ ఇష్యూ. కానీ తప్పదు. నా ఒక్కదాని కోసం సినిమా ఆగదు కదా. ఇది కోట్లతో ముడిపడ్డ విషయం. అందుకే షూటింగ్ చేస్తున్నా. కానీ నా నిర్మాతలు నన్ను పసిపాపలా చూసుకుంటున్నారు. యాక్షన్ సీన్స్‌లో కూడా నాకు ఇబ్బంది లేకుండా ప్లాన్ చేస్తున్నారు. సెట్‌లో ఓ డాక్టర్.. ఓ అంబులెన్స్.. ఎమర్జెన్సీ చికిత్సకు అవసరమైన సరంజామా.. ఇవన్నీ నాకోసం ఏర్పాటు చేశారు. అందుకే భయం లేకుండా షూటింగ్‌లో పాల్గొంటున్నా. ఈ విషయంలో నా నిర్మాతలకు థ్యాంక్స్ చెప్పకుండా ఉండలేకపోతున్నా..' అంటూ ఆనందం వెలిబుచ్చారు కియారా అద్వానీ.



# సంక్రాంతికి వస్తున్నాం టీఆర్పీ అదిరిపోయింది..!

విక్టరీ హీరో వెంకటేష్ చిత్రాలని కుటుంబంతో కలిసి చూడవచ్చు. ఆయన సినిమాలు మినిమం యావరేజ్ అయిన నడుస్తాయి. ఫ్లాప్ అనేది ఉండదు. ఈ సంక్రాంతికి సంక్రాంతికి వస్తున్నాం అనే మూవీతో పలకరించాడు. ఈ సినిమా టాలీవుడ్ లో రీజనల్ హిట్ అయ్యింది. మళ్ళీ చాలా కాలం తర్వాత తెలుగులో ఓ సినిమా రికార్డు రన్ ని అందుకొని అందరిని ఆశ్చర్యపరచచింది. సినిమాకి తొలి షో నుండి హిట్ టాక్ దక్కడంతో ఫ్యామిలీ ఆడియెన్స్ టికెట్స్ కోసం క్యూ లైన్‌లో పడిగాపులు గాసారు. ఇలా వెండితెరపై సెన్సేషనల్ హిట్ అయ్యి 300 కోట్లకి పైగా గ్రాస్ ని అందుకుంది ఈ చిత్రం. తెలుగులో ఏ సినిమా కూడా అందుకోని మాసివ్ రన్ ఈ సినిమా అందుకోవడం విశేషం.

ఇక థియేటర్ తర్వాత ఈ సినిమా ఓటీటీ, బుల్లితెరకి వచ్చేసింది. సుమారు నెలన్నర పాటు ఆపి అపుడు నేరుగా ఓటిటి సహా స్మాల్ స్క్రీన్ పై కూడా సంక్రాంతికి వస్తున్నాం చిత్రం వచ్చేసింది. సినిమా బుల్లి తెరపైనా రికార్డ్ సొంతం చేసుకుంది. ఈ మధ్య కాలంలో ఓటీటీ స్ట్రీమింగ్ అయిన చాలా రోజుల తర్వాత బుల్లి తెరపై సందడి చేస్తున్నాయి. కానీ సంక్రాంతికి వస్తున్నాం సినిమాను ఓటీటీ స్ట్రీమింగ్ కంటే ముందే జీ తెలుగు వరల్డ్ ప్రీమియర్ టెలికాస్ట్ చేయడంతో ఈ సినిమా 18.1 రేటింగ్ సాధించి రికార్డ్ కొట్టింది.కరోనా సమయంలో ఓటీటీలు ఎక్కువ కావడంతో టీఆర్‌పీ 10 రీచ్ కావడమే చాలా కష్టంగా ఉండేది.

గత ఐదేళ్ల కాలంలో పవన్ కళ్యాణ్ వకీల్ సాబ్ సాధించిన 19.12 టీఆర్‌పీ నెం.1 గా ఉండగా, ఇప్పుడు సంక్రాంతికి వస్తున్నాం సినిమా 18.1 టీఆర్‌పీ నమోదు చేసి రెండవ స్థానంలో నిలిచింది. గత రెండేళ్ల లో చూస్తే సంక్రాంతికి వస్తున్నాం సినిమానే మొదటి స్థానం దక్కించుకుంది.మన తెలుగులో ఆల్ టైం హైయెస్ట్ రేటింగ్ కనుక చూస్తే అల వైకుంఠపురములో 29 కి పైగా రేటింగ్ అందుకుంది. అయితే వెండితెరపై సంచలన విజయం సాధించిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఓ మోస్తరు సంచలనం సృష్టించింది కాని ఆల్ టైం రికార్డుగా నిలవలేకపోయింది . దీంతో ఫ్యాన్స్ కాస్త అప్సెట్‌లో ఉన్నారు. ఇక ఈ చిత్రంలో మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్ కథానాయికలుగా నటించిన విషయం తెలిసిందే. చిత్రానికి అనీల్ రావిపూడి దర్శకత్వం వహించారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com